

చిత్రపురి కాలనీని సందర్శిస్తున్న దిడ్డి సుధాకర్ తదితరులు

చిత్రపురి సొసైటీలో అక్రమాలపై
సీబీఐ దర్యాప్తు జరిపించాలి: ఆప్

కవాడిగూడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డ హైదరాబాద్‌లోని చిత్రపురి కాలనీ సొసైటీ కమిటీ నేతల సభ్యత్వాలను రద్దు చేసి వారి ఆస్తులు జప్తు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. తెలుగు సినీ వర్కర్స్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో అక్రమాలు జరిగాయని తెలుసుకున్న ఆయన శుక్రవారం చిత్రపురి కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇళ్ల, ప్లాట్ల కోసం సినీ కార్మికులు విడత వారీగా డబ్బులు చెల్లిస్తే, వారికి కేటాయించకుండా కమిటీ నేతలు ఇతరులకు అక్రమంగా అమ్ముకోవడం దారుణమన్నారు. అవినీతి కమిటీకి అండగా నిలుస్తున్న కో ఆపరేటివ్ అధికారులను సస్పెండ్ చేసి ప్రభుత్వం అడ్‌హాక్ కమిటీని నియమించాలన్నారు. అలాగే, చిత్రపురి సొసైటీలోని అక్రమాలపై సీబీఐతో దర్యాప్తు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సినీ దర్శకుడు మద్దినేని రమేష్, ఆప్ యువజన విభాగం అధ్యక్షుడు విజయ్ ముల్లంగి, మహిళా విభాగం అధ్యక్షురాలు యమునాగౌడ్, డాక్టర్ విభాగం అధ్యక్షుడు లక్ష్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేపు నిఫ్ట్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్ టెస్ట్

బర్కత్‌పుర, జనవరి3 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ (నిఫ్ట్) ఆధ్వర్యంలో ఈ నెల 5న స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు సంస్థ అకాడమిక్ డైరెక్టర్ కె.రాము యాదవ్ తెలిపారు. ఫ్యాషన్ డిజైనింగ్‌లో డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సులు, గార్మెంట్ మేకింగ్, డిజైనింగ్, ఇలస్ట్రేషన్ ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, కలర్ థియరీ తదితర కోర్సులను అందిస్తున్నామన్నారు. స్కాలర్‌షిప్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ.25 వేల వరకు ఫీజు రాయితీ పొందవచ్చన్నారు. స్కాలర్‌షిప్ టెస్ట్ రాసే విద్యార్థులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు ఫోన్ నం. 9030610033లో సంప్రదించాలని అన్నారు.

రైతు భరోసాకు మళ్లీ దరఖాస్తు చేసుకోమనడం సరికాదు

● తెలంగాణ రైతుసంఘం

చిక్కడపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా కోసం రైతులు మళ్లీ దరఖాస్తు చేసుకోమనడం సరైంది కాదని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పోతినేని సుదర్శన్‌రావు, టి.సాగర్ అన్నారు. శుక్రవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సంఘం కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో వెలువడుతున్న చైతన్యసేద్యం 2025 డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగ సుదర్శన్‌రావు, సాగర్‌లు మాట్లాడుతూ, రాష్ట్రప్రభుత్వం గత వానాకాలం యాసంగి పంటలకు ఎకరాకు 7500 ఇస్తానన్న వాగ్దానాన్ని పక్కనపెట్టి రైతులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలనడం ఎంత మాత్రం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో ప్రొ. అరిబండి ప్రసాదరావు, సారంపల్లి మల్లారెడ్డి, జూలకంటి రంగారెడ్డి, జంగారెడ్డి, రమేష్, నాగేశ్వరరావు, వెంకటేశ్వరులు, సుధాకర్‌రెడ్డి, మూడ్ శోభన్, భాగ్యలక్ష్మి, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడలో నీటి ఎద్దడిని పరిష్కరించండి

బర్కత్‌పుర, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : కాచిగూడ డివిజన్‌లో తాగునీటి ఎద్దడిని తక్షణమే పరిష్కరించాలని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి కోరారు. శుక్రవారం డివిజన్ అభివృద్ధి కార్యాలయంలో జలమండలి ఏఈ జనార్దన్, జీహెచ్ఎంసీ ఏఈ ప్రశాంత్ ఇతర సిబ్బందితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నింబోలిఅడ్డ, సూరజ్‌నగర్, మౌలానా ఆజాద్‌నగర్‌లలో తాగునీటి లోప్రెషర్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. శీత కాలంలోనే ప్రజలు మంచినీటి ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు. ఈ ప్రాంతాలలో మంచినీటి సరఫరా మెరుగుపడే విధంగా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలలు ఉన్న ప్రాంతాలలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, రవియాదవ్, మురళీ పాల్గొన్నారు.


కమ్మ విద్యార్థినులకు సివిల్స్, గ్రూప్-1 ఉచిత కోచింగ్

చిక్కడపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలలోని కమ్మ సామాజికవర్గానికి చెందిన విద్యార్థినులకు సివిల్స్, గ్రూప్-1లో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమ్మ జనసేవా సమితి నిర్వాహకుడు, పోటీ పరీక్షల నిపుణులు డా. లక్ష్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. డా. లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్, న్యూఢిల్లీ సహకారంతో ఈ ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఎంపికైన వారికి ఏడాది ఆఫ్‌లైన్ కోచింగ్, రెండేళ్ల ఆన్‌లైన్ కోచింగ్ తో పాటు లాడ్జింగ్, బోర్డింగ్ సౌకర్యాలు కూడా ఉచితంగా కల్పిస్తామన్నారు. ఆసక్తిగల తెలంగాణలోని కమ్మ సామాజికవర్గానికి చెందిన విద్యార్థినులు ఈ నెల 5వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు 8330934815 నెంబర్‌కు మెసేజ్ చేయాలన్నారు. సాయంత్రం 4 గంటలకు అశోక్‌నగర్‌లోని డా. లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీసర్కిల్‌లో జరిగే పరీక్షలో ప్రతిభకనపర్చిన 50 నుంచి 100 మందికి ఈ ఉచిత కోచింగ్ కోసం ఎంపిక చేస్తామన్నారు.

సంక్రాంతి పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం


చిక్కడపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ రంగాలకు చెందిన వారి నుంచి సంక్రాంతి పురస్కారాలు-2025 ఎంపిక కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సర్వేజనా సుఖినోభవంతు సంస్థ స్థాపక అధ్యక్షుడు లయన్ డా.ఈఎస్ఎస్ నారాయణ మాష్టారు తెలిపారు. సమాజ సేవకులు, ఉపాధ్యాయులు, వైద్యులు, ఇంజనీర్లు, యోగ, మెడిటేషన్, సంగీతం, నృత్యగురువులు, సినీ,టీవీ, రంగస్థల కళాకారులు, కవులు, రచయితలు, క్రీడాకారులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు, ఫొటోగ్రాఫర్లు తదితరులకు ఈనెల 19న నగరంలో పురస్కారాలు ఇచ్చి సత్కరిస్తామన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 10వ తేదీ లోపు 1-20-164, తిరుమలగిరి, గోకుల్‌నగర్, వెంకటాపురం, సికింద్రాబాద్-15 చిరునామాకు దరఖాస్తులు పంపాలని, మరిన్ని వివరాలకు 9652347207 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నేడు ఏబీఎన్, ఆంధ్రజ్యోతి న్యూస్ ప్రెజెంటర్‌కు ప్రతిభా అవార్డు ప్రదానం



యామిని

చిక్కడపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆరాధన సంస్థ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం త్యాగరాయగానసభలో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి న్యూస్‌ఛానల్ న్యూస్ ప్రెజెంటర్ యామినికి ప్రతిభాపురస్కారం 2024 ప్రదానం చేయనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకుడు లోకం కృష్ణయ్య తెలిపారు. హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ శేషశయనారెడ్డి తదితరులు పురస్కారాన్ని బహూకరిస్తారన్నారు.



అయ్యప్పస్వామికి పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే ముఠాగోపాల్ దంపతులు

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావన అలవర్చుకోవాలి

●ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మిక భావనను అలవర్చుకోవాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే గోపాల్ దంపతులు, బీఆర్ఎస్ నాయకులు శబరికి వెళ్లి అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతీ సంవత్సరం శబరికి వెళ్లి స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గౌరీశంకర ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్ చారి, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ మీడియా సెల్ అధ్యక్షుడు ముచ్చకుర్తి ప్రభాకర్, పార్టీ సీనియర్ నాయకులు కరికె కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గొప్ప సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల పరిధిలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహాలకు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, నిమ్నవర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతిరావు పూలే భార్య అయిన సావిత్రిబాయి స్త్రీల విద్యాభివృద్ధికి కృషిచేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి అని అన్నారు.

- (ముషీరాబాద్, అంబర్‌పేట జోన్ల బృందం)



సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గాంధీనగర్ కార్పొరేటర్ పావనీ వినయ్‌కుమార్



సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ తదితరులు



కుల వివక్ష వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్యవిజ్ఞాన కేంద్రం వద్ద సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాశక్తి పూర్వ సంపాదకుడు ఎస్.వినయ్‌కుమార్, టి.స్కైలాబ్‌బాబు తదితరులు



అంబర్‌పేట పూలే చౌరస్తాలో బీసీ కుల సంఘాల ఐక్యవేదిక నియోజకవర్గ అధ్యక్షుడు పెంటం వెంకట్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్ర ప్రధానకార్యదర్శి వేణుమాధవ్, నగర ప్రధాన కార్యదర్శులు చంద్రరాజుల రుక్మిణి, రేణుక, ఈశ్వర్‌రావు, బీజేపీ గోల్నాక డివిజన్ అధ్యక్షుడు మూల రవీందర్ గౌడ్ .



నల్లకుంటలో సావిత్రి బాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కేపీ మురళీకృష్ణ తదితరులు

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయండి

● జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులకు ఎమ్మెల్యే కాలేరు ఆదేశం

గోల్నాక, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై శుక్రవారం గోల్నాకలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ఆరా తీసిన ఆయన పనులు ఎందుకు నత్తనకన జరుగుతున్నాయని ప్రశ్నించారు. ఆయా డివిజన్‌లో కొనసాగుతున్న రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి పైపులైన్ల నిర్మాణ పనులను వేగవంతంగా చేపట్టి పూర్తి చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఇంకా ఆయా డివిజన్లలో నూతనంగా చేపట్టాల్సిన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. సమావేశంలో అంబర్‌పేట, బాగ్‌అంబర్‌పేట డివిజన్ల కార్పొరేటర్లు ఈ. విజయకు మార్‌గౌడ్, బి.పద్మావెంకటరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బి.వెంకటరెడ్డి, జీహెచ్ఎంసీ ఈఈ రమేష్‌బాబు, డీఈఈలు ప్రశాంతి, సంజయ్‌కుమార్, జలమండలి జీఎం రామకృష్ణ, డీజీఎంలు విష్ణువర్ధన్‌రావు, వై.కృష్ణ, జీహెచ్ఎంసీ ఏఈలు, జలమండలి ఏఈలు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, పాల్గొన్న కార్పొరేటర్లు విజయకుమార్‌గౌడ్, పద్మావెంకటరెడ్డి

సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

అంబర్‌పేట, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : అంబర్‌పేట డివిజన్ బాపూనగర్‌లో రూ. 18 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కార్పొరేటర్ విజయ్ కుమార్‌గౌడ్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు భాగ్యరెడ్డి వర్మ

●మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి

చిక్కడపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్‌వద్ద ఆది హిందీ విద్యాలయాన్ని నిర్మించి అణగారిన వర్గాలకు విద్యను అందుబాటులోకి తెచ్చిన భాగ్యరెడ్డివర్మ చిరస్మరణీయుడని సీపీఎంనేత, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఎందరో మహానుభావుల మధురస్మృతులలో భాగంగా భాగ్యరెడ్డి వర్మ సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నరసింహారెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ నేలపై ఆవిర్భవించిన భాగ్యరెడ్డివర్మ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌కంటే ముందుగానే దీనుల ఉద్ధరణ కోసం పోరాడిన దళిత జన బాంధవుడని అన్నారు. భాగ్యరెడ్డివర్మ నైజాంపాలిత ప్రాంతాల్లో వివక్షతకు వ్యతిరేకంగా నిరంతర పోరాటం చేసిన త్యాగశీలి అన్నారు. ఆయనకు చరిత్రలో తగిన గుర్తింపు రాలేదని అన్నారు. కార్యక్రమంలో సిద్ధేంద్ర ఆర్ట్స్ అకాడమీ అధినేత్రి దేవసేన, పుష్పాంజలి రిథమ్ అధ్యక్షుడు బాలాజికుమార్, గాయని మంగరాజు రుక్మిణిపాల్గొన్నారు.

సర్పంచ్‌ల ఆత్మహత్యల పాపం బీఆర్ఎస్ ప్రభుత్వానిదే

● సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు భూమన్న యాదవ్

బర్కత్‌పుర, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : సర్పంచ్‌ల ఆత్మహత్యల పాపం బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని, 2019 నుంచి 2023 వరకు కేసీఆర్ హయంలో జరిగిన సర్పంచ్‌ల ఆత్మహత్యలపై సమగ్ర విచారణ జరిపించాలని తెలంగాణ రాష్ట్ర పంచాయతీ సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సౌదాని భూమన్న యాదవ్ డిమాండ్ చేశారు. త్వరలో ఆత్మహత్యలు చేసుకున్న సర్పంచ్ కుటుంబ సభ్యులు, ప్రస్తుత సర్పంచ్‌లతో కలిసి కేసీఆర్ ఫామ్‌హౌస్, తెలంగాణ భవనం ముట్టడిస్తామని హెచ్చరించారు. శుక్రవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2018లో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం పంచాయితీ రాజ్ యాక్ట్‌ను తీసుకువచ్చి ఉప సర్పంచ్‌లకు జాయింట్ చెక్ పవర్ కల్పించి సర్పంచ్‌లను అన్ని విధాలుగా ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. 12 మంది సర్పంచ్‌లు చేసిన అభివృద్ధి పనులకు డబ్బులు రాక అప్పులు చెల్లించలేక ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్‌ల ఆత్మహత్యలకు కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులు నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

'దుర్గాబాయ్ దేశ్‌ముఖ్'లో అరుదైన శస్త్ర చికిత్స

రాంనగర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : విద్యానగర్‌లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ రెనోవో క్యాన్సర్ సెంటర్‌లో అరుదైన శస్త్ర చికిత్స జరిగింది. మాక్సిల్లరీ సైనస్ కార్సినోమా వ్యాధితో బాధపడుతున్న నిజామాబాద్ జిల్లా గుత్ప గ్రామానికి చెందిన గుమ్మల సాయన్న (58)కి విజయవంతంగా మైక్రో వాస్క్యులర్ సర్జరీ నిర్వహించారు. ఆస్పత్రిలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ప్రముఖ అంకాలజిస్ట్ డాక్టర్ యు.ఆజాద్ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. గుమ్మల సాయన్న ఏడాది కాలంగా ముఖంలో వాపు, కుడి దవడ దగ్గర పది సెంటి మీటర్ల కణితి, కంటి నుంచి నీరు కారడం వంటి సమస్యలతో పాటు ఆహారం తినడానికి కూడా ఇబ్బంది పడుతున్నాడు. ఆయన పలు ఆస్పత్రులను సంప్రదించగా మాక్సిల్లరీ సైనస్ కార్సినోమా వ్యాధిగా నిర్ధారణ నిర్ధారించారు. శస్త్రచికిత్సకు పెద్దమొత్తంలో ఖర్చవుతుందని తెలిపారు. దీంతో ఆయన దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ రెనోవో క్యాన్సర్ సెంటర్‌ను సంప్రదించగా తక్కువ ఖర్చుతో చికిత్స చేస్తామని చెప్పారు. తనతో పాటు సీనియర్ సర్జికల్ అంకాలజిస్టులు డాక్టర్ రాకేష్, డాక్టర్ శంకర్‌గౌడ్, క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్‌రెడ్డి, కన్సల్టెంట్ సర్జికల్ డాక్టర్లు శ్రీనాథ్, సుమంత్, మధుసూదన్‌రావు; శ్రీవల్లిల బృందం 10 నుంచి 12 గంటలు శ్రమించి సాయన్నకు విజయవంతంగా సర్జరీ పూర్తి చేశామని డాక్టర్ ఆజాద్ చంద్రశేఖర్ తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ నాగేశ్వరరావు తెలిపారు. రామాలయం 11 కేవీ ఫీడర్ పరిధిలోని నల్లకుంట సిండికేట్ బ్యాంక్, నరేంద్రపార్క్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, డీడీ కాలనీ పరిధిలోని రామచంద్ర డిగ్రీ కాలేజీ, గ్లాస్కో, హిల్టన్‌కేఫ్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సా. 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.



గ్రేటర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ డైరీ ఆవిష్కరణ

గ్రేటర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 సంవత్సరం డైరీ ఆవిష్కరణ శుక్రవారం సంస్థ కార్యాలయంలో జరిగింది. డైరీని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సయ్యద్ ఇమామ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఎం.నర్సయ్య, చంద్రమోహన్, ఝాన్సీ వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు. - (రాంనగర్, ఆంధ్రజ్యోతి)

'నుమాయిష్' ఆదాయంతో విద్యాసంస్థల సంఖ్యను పెంచాలి: మంత్రి

అఫ్జల్‌గంజ్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నుమాయిష్ ద్వారా వచ్చే ఆదాయంతో నిర్వహిస్తున్న విద్యాసంస్థల సంఖ్యను మరింత పెంచాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎగ్జిబిషన్ సొసైటీకి సూచించారు. శుక్రవారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన నుమాయిష్‌ను మంత్రి డి. శ్రీధర్‌బాబు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎంపీ హనుమంతరావు (వీహెచ్)తో కలిసి బెలున్లు ఎగురవేసి ప్రారంభించారు. అనంతరం పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రస్తుతం ఇరవై విద్యాసంస్థలు కొనసాగుతుండగా వాటిని 30వరకు పెంచాలని కోరారు. అందుకు అవసరమయ్యే అనుమతులు, ఇతరాత్ర సహకారాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఎగ్జిబిషన్ స్థలం లీజు విషయమై ముఖ్యమంత్రితో మాట్లాడతానన్నారు. ఐటీ మంత్రి డి.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కమలా నెహ్రూ పాలిటెక్నిక్ కళాశాలను వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంజనీరింగ్ కాలేజీగా మార్చి అడ్మిషన్లు చేపడుతామన్నారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు, తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు కె.నిరంజన్, కార్యదర్శి బి.సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేట్ ఉద్యోగి అదృశ్యం



విశ్వప్రసాద్

అంబర్‌పేట, జనవరి 3(ఆంధ్ర జ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో ఓ ప్రైవేట్ ఉద్యోగి అదృశ్యమైన ఘటన అంబర్‌పేట పీఎస్ పరిధిలో జరిగింది. సీఐ డి.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. బాగ్‌అంబర్‌పేట తురాబ్‌నగర్‌లో ని వాసం ఉండే అంజయ్య కుమారుడు విశ్వప్రసాద్ (36) కోఠిలో ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యో గం చేస్తున్నాడు. ఇతడికి భార్య ఉంది. విశ్వప్రసాద్ కొద్ది రోజులుగా ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాడు. ఈ నెల 2వ తేదీ ఉద్యోగానికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. విశ్వప్రసాద్ కో సం గాలించినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు శుక్రవారం అంబర్‌పేట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వై.మౌనిక కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ జర్నలిస్టు కె.శ్రీనివాస్

హైదరాబాద్ పుస్తక ప్రదర్శనలో దాడి
ఆకస్మికంగా జరిగింది కాదు: వక్తలు

పంజాగుట్ట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): 'హైదరాబాద్ నగరంలో ఇటీవల జరిగిన పుస్తక ప్రదర్శనలో అనువాదకులు, సంపాదకులు, ప్రచురణకర్తల మీద జరిగిన దాడి ఆకస్మికంగా జరిగింది కాదు. తెలంగాణలో మత విద్వేషాలు సృష్టించి అధికారంలోకి రావాలనే పథకం ఉంది. మూక దాడి సంస్కృతి సమాజానికి ప్రమాదం. కుట్రపూరితంగా టార్గెట్‌గా చేసుకుని చేసే దాడులను కలిసి కట్టుగా ఎదుర్కొందామని' పలువురు వక్తలు పిలుపునిచ్చారు. సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం, తెలంగాణ పర్ పీఎస్, యూనిటీ ఆధ్వర్యంలో 'పుస్తక రచన, ప్రచురణ, విక్రయాలపై మతోన్మాద శక్తుల దాడిని ఖండిద్దాం' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ పుస్తక ప్రదర్శనలో జరిగిన సంఘటనలు ఆకస్మికంగా జరిగిన సంఘటన కాదని అన్నారు. రాజ్యాంగం ఇచ్చిన రక్షణలను మార్చడానికి ప్రయతించే శక్తులే భావప్రకటన స్వేచ్ఛ మీద దాడికి పూనుకుంటున్నాయని అన్నారు. సీనియర్ జర్నలిస్టు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఒక నిర్మాణాత్మకమైన కృషి జరగాలని, కవులు, రచయితలు, సంపాదకులు, సామాజిక కార్యకర్తలపై దాడి ఇది మొదటిది కాదు చివరిది కాదు అని, ఇప్పటి వరకు మూడు సంఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ ఫాసిజం పునాదులు మనిషి భయంతో ఉంటాయని అన్నారు. అల్లం నారాయణ మాట్లాడుతూ వారికి ఒక్క దేవుడు లేడని, చాలా మంది దేవుళ్ళు ఉన్నారని, అయ్యప్ప కూడా వారి దేవుడు అయ్యాడని అన్నారు. నందిని సిధారెడ్డి మాట్లాడుతూ అస్థిత్వాల మధ్య చీలిక ఉండడంతో మనం బలహీనంగా కనబడుతున్నామని అన్నారు. రమా మేల్కొటే, వివిధ సంఘాల నాయకులు సజయ, వి.సంధ్య, సారా మాథ్యూ, కల్పనా కన్నాబిరామన్, తిరుణగిరి దేవకి దేవి, అరుణ తదితరులు మాట్లాడారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు, కవులు, రచయితలు వి.ఎస్ బోస్, చూపు కాత్యాయని, సత్యవతి, కృష్ణ కుమారి, ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, స్టాలిన్, కేవీఎల్, విబి జ్యోతి, జితిన్ కుమార్, శివలక్ష్మి పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న తెలుగు సంఘాల ప్రతినిధులు

ప్రపంచ తెలుగు మహాసభలు ప్రారంభం

హైదరాబాద్ సిటీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలుగు వారందరినీ ఒకే వేదికమీదకు తెచ్చింది ప్రపంచ తెలుగు సమాఖ్య. ఆ సంస్థ 12వ ద్వైవార్షికోత్సవ మహాసభలు శుక్రవారం నోవాటెల్‌లో ప్రారంభమయ్యాయి. అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, హాంకాంగ్, సింగపూర్, గల్ఫ్ దేశాల తెలుగు సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. మారిషస్, మలేషియా, మయన్మార్ తదితర దేశాల్లో రెండు శతాబ్దాల కిందట వలసవెళ్లిన వారి వారసులు విచ్చేశారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే వామనగుంటలు, అష్టాచెమ్మ, వైకుంఠపాళి తదితర ఆటలు, బొమ్మల కొలువులు సందర్శకులను ఆకట్టుకున్నాయి. శుక్రవారం మొదలైన ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలకు మారిషస్ నుంచి 23మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఆంగ్లేయుల పాలనలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి కొందరు మారిషస్‌కు కూలీలుగా వలస వెళ్లారు. వారి సంతతికి చెందిన నాలుగో తరం ఆ దేశంలో 50వేల మందికిపైగా ఉన్నట్లు మారిషస్ తెలుగు సంఘం ప్రతినిధి సింహాద్రి అచ్చయ్య తెలిపారు. భాద్రపద పాడ్యమి రోజు నుంచి 40రోజుల పాటు దుర్గాపూజ, గోవిందదీక్ష.. శ్రీరామ నవమి, ఉగాది పండుగలు ఘనంగా జరుపుకుంటామని మారిషస్ తెలుగు సంఘం అధ్యక్షుడు హెవిన్ గురయ్య 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేకంగా వివరించారు. ఏపీ , తెలంగాణలోని తమ పూర్వీకుల మూలాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నట్లు వారు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణలు



రవాణా శాఖ హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ అసోసియేషన్ రూపొందించిన 2025 క్యాలెండర్‌ను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ వికాస్‌రాజు, జేటీసీలు రమేష్, చంద్రశేఖర్‌గౌడ్, శివలింగయ్య, డీటీసీ రవీందర్‌గౌడ్, అసోసియేషన్ అధ్యక్షుడు నాయకం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ప్రతీష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, కోశాధికారి హనుమంతు, జాయింట్ సెక్రటరీ నవీన్ తదితరులు పాల్గొన్నారు. - (బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి)

ఆవిష్కరించిన ఎమ్మెల్యే..



బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గండికోట జనార్ధన్ రూపొందించిన 2025 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను శుక్రవారం తన నివాసంలో ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ .

-(గోల్నాక,ఆంధ్రజ్యోతి)

రైల్వే టికెట్ చెకింగ్ స్టాఫ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో...



ఇండియన్ రైల్వే టికెట్ చెకింగ్ స్టాఫ్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను శుక్రవారం దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ ఆవిష్కరించారు. డివిజనల్ అధ్యక్షుడు ఎం.కిరణ్‌కుమార్, కార్యదర్శి ఎం.కె.ఉదయ్‌భాస్కర్, కోశాధికారి వి.వేణుమాధవ్ పాల్గొన్నారు.